
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in
28-7-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

## ఇందూరు నయాగరా..







## కరెంట్ తీగలు.. మృత్యుపాశాలు..

## ఓపెన్ స్కూల్ పరీక్షల ఫీజు చెల్లించాలి

**అక్షరటుడే, ఇందూరు:** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్షలకు ఫీజు చెల్లించే తేదీలు ఖరారైనట్లు జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షల ఫీజు ఈనెల 28 నుంచి ఆగస్టు 5వ తేదీ లోపు చెల్లించాలన్నారు. అలాగే రూ.25 అపరాధ రుసుముతో ఆగస్టు 10లోపు చెల్లించవచ్చని, రూ.50 అపరాధ రుసుముతో ఆగస్టు 11 నుంచి 15వ తేదీ లోపు, తత్కాల్ రుసుముతో ఆగస్టు 16 నుంచి 18వ తేదీ వరకు చెల్లించే అవకాశం ఉందని పేర్కొన్నారు. పరీక్ష ఫీజు టీఎస్ ఆన్‌లైన్, ఏపీ ఆన్‌లైన్, మీసేవ సెంటర్‌లో చెల్లించాలని పేర్కొన్నారు.

# ఆలయాలకు శ్రావణ శోభ



ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఆలయాలు శ్రావణశోభను సంతరించుకున్నాయి. శ్రావణమాసం మొదటి సోమవారం కావడంతో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నగరంలోని నీలకంఠేశ్వరాలయం, శంభుని గుడిలో భక్తులు ఉదయం నుంచే దర్శనం కోసం బారులు తీరారు. అంతే కాకుండా భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయం, బోధన్‌లోని ఏకచక్రేశ్వరాలయం, సిద్ధుల గుట్ట తదితర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో భక్తుల కోసం ఏర్పాట్లు చేశారు.

- అక్షరటుడే, ఇందూరు



## జిల్లాకు మంత్రులు సీతక్క, పొంగులేటి రాక





**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి జిల్లాలో ఇద్దరు మంత్రుల పర్యటన ఖరారైంది. జిల్లా ఇంఛార్జి మంత్రి సీతక్క, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లాకు రానున్నారు. వీరు దోమకొండ మండల కేంద్రంలో మంగళ వారం నిర్వహించే నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

**ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు..**

మంత్రుల పర్యటన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. దోమకొండ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కాగా.. దోమకొండ మండలానికి చెందిన 352 కొత్త రేషన్ కార్డులు, 1,841 మెంబర్ యాడింగ్ కార్డులు, బీబీపేట మండలానికి చెందిన 555 కొత్త రేషన్ కార్డులు, 1,547 మెంబర్ యాడింగ్ కార్డులను లబ్ధిదారులకు మంత్రులు పంపిణీ చేయనున్నారు. మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం ఫంక్షన్ హాల్‌లో పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు.




# ప్రైవేటు వ్యక్తులతో పనులు..

- బోధన్, ఎల్లారెడ్డి రూరల్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తంతు
- అధికారిక పనులు చక్కబెడుతున్న వైనం

**రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతి, అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ స్లాట్ విధానంలో డాక్యుమెంట్లు జరిగేలా సాంకేతికతను అందుబాటులోకి తెస్తోంది. అయినా పలు కార్యాలయాల్లో మాత్రం అధికారులు, సిబ్బంది తీరు మారట్లేదు. డాక్యు మెంట్ రైటర్లపై ఆధారపడి పనిచేస్తున్నారు. మరికొన్ని కార్యాలయాల్లో ఏకంగా ప్రైవేటు వ్యక్తులు, డాక్యుమెంట్ రైటర్లకు కంప్యూటర్ గదుల్లోనే చైర్లు వేయించి మరీ అధికారిక పనులు చేయించడం గమనార్హం.** – అక్షరటుడే, నిజామాబాద్

బోధన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గత కొంతకాలంగా ప్రైవేటు వ్యక్తులతో అధికారిక పనులు చేయిస్తున్నారు. ముగ్గురు వ్యక్తులు ఈ కార్యాలయంలోనే ఉండి అన్ని రకాల డాక్యుమెంట్ పనులు చక్కదిద్దుతున్నారు. సోమవారం 'అక్షరటుడే' ప్రతినిధి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లగా సదరు వ్యక్తులు పనులు చక్కబెడుతూ కనిపించారు. వివిధ రకాల సేవల నిమిత్తం వచ్చే ప్రజల నుంచి నేరుగా డాక్యుమెంట్లు తీసుకుని వారే సేవలందించడం ఆశ్చర్యకరం. మరోవైపు కంప్యూటర్లలోనూ ఆన్‌లైన్‌లో పనులు చేస్తూ కనిపించారు. ఇంత జరుగుతున్నా కార్యాలయ

–మిగతా 2లో




# అక్రమ వసూళ్లపై చర్యలేవి..

- నిజామాబాద్ జిల్లా విద్యాశాఖ తీరుపై విమర్శలు
- ప్రక్షాళనకు పూనుకోని జిల్లా విద్యాశాఖాధికారి

**నిజామాబాద్ జిల్లా విద్యాశాఖలో అంతులేని అవినీతి జరుగుతోంది. ప్రత్యేకించి పలు విభాగాలు, సిబ్బంది రూ.లక్షల్లో దండుకుంటున్నారు. ప్రైవేటు స్కూళ్ల రెన్యూవల్ కోసం ముక్కుపిండి మరీ యాజమాన్యాల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. సొంత కార్యాలయంలో ఇంత జరుగుతున్నప్పటికీ డీఈవో అశోక్ పట్టనట్లు వ్యవహరిస్తుండడంపై విమర్శలు వస్తున్నాయి. కాగా.. పలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినట్లు తెలుస్తోంది.** –అక్షరటుడే, నిజామాబాద్

జిల్లా విద్యాశాఖాధికారిగా అశోక్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కార్యాలయం చక్కబడుతుందని అంతా భావించారు. ప్రత్యేకించి గత అధికారి హయాంలో అవినీతికి పాల్పడిన వారికి చెక్ పెడతారని.. పూర్తి ప్రక్షాళన చేస్తారని అనుకున్నారు. కానీ ప్రస్తుతం పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తున్నాయి. వ్యక్తిగతంగా డీఈవో ఎలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడకపోయిన్పటికీ కిందిస్థాయి అధికారులు, సిబ్బంది మాత్రం చేయితడపనిదే ఏ పని చేయట్లేదు. ఒక్కో దస్త్రానికి ఒక్కో రేటు నిర్ణయించి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు.

–మిగతా 2లో

## వైద్యులు అందుబాటులో ఉండాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్యులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వైద్య సిబ్బందికి సూచించారు. ఆయన మాచారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాల్వంచ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను సోమవారం తనిఖీ చేశారు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. వైద్యుల హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్, మండల ప్రత్యేక అధికారి, రెవెన్యూ అధికారులున్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



**అక్షరటుడే, భీమ్‌గల్:** వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆర్మూర్ డివిజన్ పంచాయతీ అధికారి శివకృష్ణ అధికారులకు సూచించారు. బాల్కొండ మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో పచ్చదనం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై సమీక్షించారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా ఫాగింగ్ చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో గంగామోహన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పదోన్నతి బాధ్యతను పెంచుతుంది: ఎస్పీ



**అక్షరటుడే, కామారెడ్డి:** పదోన్నతులు పోలీసులకు మరింత బాధ్యతను పెంచుతాయని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. ఏఎస్సై నుంచి ఎల్లారెడ్డి ఎస్సైగా పదోన్నతి పొందిన నరేందర్.. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన నరేందర్‌కు ఎస్పీ పదోన్నతి చిహ్నాన్ని అలంకరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పదోన్నతి ద్వారా పోలీసులకు గుర్తింపుతో పాటు విధులపట్ల ఉత్సాహం ఉంటుందన్నారు. పదోన్నతులు పొందిన పోలీస్ సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవలందించాలని కోరారు. పోలీసుశాఖలో క్రమశిక్షణతో పాటు నిబద్ధతతో బాధ్యతలు నిర్వహించే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, గౌరవ మర్యాదలు లభిస్తాయని ఆయన చెప్పారు.

## రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ: షబ్బీర్‌అలీ

**అక్షరటుడే, ఇందూరు:** రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో సోమవారం అర్బన్ నియోజకవర్గ లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 13 ఏళ్ల తర్వాత కొత్త రేషన్ కార్డుల కలను రాష్ట్ర ప్రభుత్వ సాకారం చేసిందన్నారు. ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ.. తమ ప్రభుత్వం కార్డులను అందిస్తుందని గుర్తు చేశారు. అర్హులైన వారు మిగిలి ఉంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్డులు రానివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ పేర్కొన్నారు. జిల్లాలో 11,852 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని, 84,232 మంది సభ్యుల పేర్లను కార్డులో చేర్చామన్నారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలోని నార్త్, సౌత్ మండలాల పరిధిలో 3,174 కుటుంబాలకు కొత్త కార్డులు, 1687 మంది సభ్యుల పేర్లు నమోదు చేయడం జరిగిందని చెప్పారు.



లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న షబ్బీర్‌అలీ

కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, అదనపు కలెక్టర్ అంకిత్, నుడా ఛైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, ఆర్డీవో రాజేంద్రకుమార్, డీఎస్‌వో అరవింద్ రెడ్డి, సౌత్, నార్త్ తహశీల్దార్లు బాలరాజు, విజయ్ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**అక్షరటుడే, ఇందూరు:** ప్రజావాణికి ప్రాధాన్యత నిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 112 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని ఆయా ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌తో పాటు, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్మావి , డీఆర్డీవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్, మెప్మా పీడీ రాజేందర్, ఏసీపీ వెంకటేశ్వర్ రావులకు వివరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అక్షర టుడే
Web News
E-Paper

విలేకరులు కావలెను

అనతి కాలంలోనే మిలియన్ల మంది పాఠకులను సొంతం చేసుకుని.. డిజిటల్ మీడియాలో దూసుకెళ్తున్న అక్షరటుడేలో పనిచేసేందుకు విలేకరులు కావలెను. తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి, సామాజిక స్పృహతో స్పందించే ఉత్సాహం ఉండి.. అనుభవజ్ఞులైన వారికి మొదటి ప్రాధాన్యం ఉంటుంది. ఆర్మూర్, బాల్కొండ, నందిపేట, కామారెడ్డి, వర్ని, బిచ్కుంద, జుక్కల్, మద్నూర్‌లకు విలేకరులు కావలెను. ఆసక్తి గల వారు 9010337369 నంబరును సంప్రదించగలరు

WWW.AKSHARATODAY.IN

## సీసీ రోడ్లు, డ్రైయినేజీలు నిర్మించాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని 13వ వార్డులో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని కాలనీవాసులు కోరారు. ఈ మేరకు సోమవారం వార్డు మాజీ కౌన్సిలర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కిరణ్మయిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వార్డులో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులు అసంపూర్తిగా వదిలేశారన్నారు. జగ్గర్ ట్రైలర్ నుంచి ఎల్లయ్య చెరువు సీసీ రోడ్డు వరకు, అయ్యప్ప గుడి వద్ద టీచర్స్ కాలనీ ఫస్ట్ రోడ్డు బాలికల వసతి గృహం వద్ద సీసీ రోడ్డు పనుల్లో జాప్యం చేస్తున్నారని సబ్ కలెక్టర్‌కు వివరించారు. దీంతో వెంటనే స్పందించిన సబ్ కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజును పిలిచి పనుల విషయమై ఆదేశించారు. కార్యక్రమంలో స్టీవెన్ మల్లేష్, మోసిన్, పవన్ పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



**అక్షరటుడే, బాన్సువాడ:** రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్ తెలిపారు. గుజరాత్‌లోని రాజ్ కోట్‌లో భూమి అగ్రో ఇండస్ట్రీస్ రోటీవేటర్, కల్టివేటర్, సీడ్ గ్రైనేర్ ఫ్యాక్టరీలను సోమవారం పరిశీలించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులకు అనుగుణంగా రైతులకు మేలు చేసే పరికరాల పరిశీలన కోసం గుజరాత్‌లో పర్యటించినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ యూనుస్, మేనేజింగ్ డైరెక్టర్ కిరణ్ తదితరులు ఉన్నారు.

## యువకుల శ్రమదానం



**అక్షరటుడే, భీమ్‌గల్:** పట్టణంలోని నందిగల్లి లవకుశ గుడిలో రాయల్ పటేల్ యువజన సంఘం సభ్యులు శ్రమదానం చేశారు. ప్రతివారం ఒక్కో ఆలయాన్ని శుభ్రపరుస్తామని ఇందులో భాగంగా సోమవారం లవకుశ ఆలయంలో పిచ్చి మొక్కలను,చెత్తను పూర్తిగా తొలగించామని యువకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాయల్ పటేల్ యువజన సంఘం అధ్యక్షుడు అడుప రఘు, కుమ్మరి హరీష్ పటేల్, కార్తీక్, నాగేంద్ర, సాగర్, చిన్న నర్సయ్య, గణేష్, నరేష్ పాల్గొన్నారు.



# ఇందూరు నయాగరా..

దట్టమైన అడవి, ప్రకృతి అందాల నడుమ శీలం జానకీ బాయి జలపాతం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. పచ్చని అడవిలో చెరువు అలుగుపై నుంచి పొంగి పొర్లే నీరు జలపాతాన్ని తలపిస్తుండడంతో ఎంతో మంది చూడటానికి వస్తున్నారు. జలసవ్వడులు, అడవి అందాలు చూసి ఎంతో మంది అక్కడ సేద తీరుతారు. జలపాతంతో పాటు సిర్నాపల్లిలో పురాతన కట్టడాలు ఉన్నా పర్యాటక అభివృద్ధికి మాత్రం అధికారులు చర్యలు చేపట్టడం లేదు. - అక్షరటుడే ఇందల్వాయి

- ప్రకృతి అందాల నిలయం సిర్నాపల్లి
- పర్యాటకులను ఆకర్షిస్తున్న జలపాతం
- ప్రత్యేక ఆకర్షణగా పురాతన కట్టడాలు
- పర్యాటకాభివృద్ధికి చర్యలు శూన్యం

ఇందల్వాయి మండలం సిర్నాపల్లి గతంలో సంస్థానంగా ఉండేది. రాణి శీలం జానకీ బాయి ఈ సంస్థానాన్ని పాలించారు. ఆమె హయాంలో నిర్మించిన పురాతన కట్టడాలు, సిర్నాపల్లి గడి, దేవాలయాలు, అత్యంత అరుదైన అర్ధనారీశ్వర రూపంలో ఉన్న శివలింగం, ప్రకృతి ఒడిలో దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న చెరువు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. శీలం జానకీ బాయి చెరువును అటవీ ప్రాంతంలో నిర్మించారు. దీని అలుగు చాలా ఎత్తు ఉంటుంది. అయితే అలుగు పారినప్పుడు జలపాతంలానీరు కిందకు పడుతుంది. ఆ దృశ్యాలను చూడడానికి ప్రతి వానాకాలంలో వేలాది మంది తరలివస్తుంటారు. అయితే పర్యాటకులకు కనీస వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు.

### బురద రోడ్డే దిక్కు..

శీలం జానకీబాయి జలపాతాన్ని చూడటానికి పర్యాటకులు నిత్యం వస్తున్నారు. అయితే చెరువు వద్దకు వెళ్లడానికి రోడ్డు లేక వారు ఇబ్బందులు పడుతున్నారు. బురద రోడ్డుపై అవస్థలు పడుతూ.. జలపాతం వద్దకు చేరుకుంటున్నారు. చెరువు వరకు రోడ్డు వేస్తే పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని గ్రా




మస్థులు అంటున్నారు. అలాగే గ్రామంలోని పురాతన కట్టడాలను అభివృద్ధి చేసి పర్యాటకంగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.

### పలు సినిమాల చిత్రీకరణ

సిర్నాపల్లి ప్రకృతి అందాల గురించి ఎంత చెప్పినా తక్కువే. దీంతో ఇక్కడ పలు సినిమాల చిత్రీకరణ కూడా చేపట్టారు. గతంలో ఎస్పీ పరశురాం, ఫిదా సినిమా ఇక్కడ తీశారు. అలాగే చాలా షార్ట్ ఫిలిమ్స్‌ను ఇక్కడ చిత్రీకరిస్తుంటారు. దీంతో గ్రామాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు. పర్యాటకుల కోసం వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

### ఆదర్శ గ్రామంగా ..


సిర్నాపల్లి గత ప్రభుత్వ హయాంలో ఆదర్శ గ్రామంగా నిలిచింది. సర్పంచ్ విజయకుమార్ ప్రత్యేక చొరవ చూపి మియావాకి ద్వారా చెట్లను బాగా పెంచారు. ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో నిధులు సేకరించి గ్రంథాలయ ఏర్పాటు, పురాతన కట్టడాలకు రంగులు వేయడం, సిర్నాపల్లి గడీలో దొరసాని విగ్రహ ఏర్పాటు, ప్రత్యేక రోడ్లు, పల్లె ప్రకృతి వనంలో అరుదైన చెట్లను నాటి ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దారు.

### రోడ్డు, రైలు రవాణా సౌకర్యం

ప్రకృతి అందాల నెలువైన సిర్నాపల్లికి రోడ్డు, రైలు మార్గం ద్వారా చేరుకోవచ్చు. ఇక్కడ రైల్వే స్టేషన్ కూడా ఉంది. జాతీయ రహదారి 44 నుంచి సిర్నాపల్లి వరకు డబుల్ రోడ్డు కూడా ఉంది. నిజామాబాద్ నుంచి గంటలో సిర్నాపల్లి చేరుకోవచ్చు. అయితే గ్రామం నుంచి జలపాతం వరకు రోడ్డు లేక పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. నిధులు కేటాయించి రోడ్డు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### నిధులు కేటాయించాలి

సిర్నాపల్లి గ్రామాన్ని పర్యాటక కేంద్రం చేసేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించాలి. జలపాతం వద్దకు వెళ్లే రోడ్డును బాగు చేయించాలి. ప్రభుత్వం నిధులు కేటాయిస్తే గ్రామం తరఫున సహకారాలు అందిస్తాం. – సొప్పరి నరేష్, వీడీసీ సభ్యుడు



### పర్యాటకులు వస్తున్నారు

ఐదేళ్ల నుంచి సిర్నాపల్లికి పర్యాటకులు ఎక్కు వగా వస్తున్నారు. జలపాతం వద్ద రక్షణ చర్యలు చేపట్టేందుకు గ్రామ కమిటీ ఖర్చులు భరించాల్సి వస్తోంది. ప్రభుత్వం నిధులు కేటాయిస్తే మరింత అభివృద్ధి జరుగుతుంది. – కె పురుషోత్తం, మాజీ సర్పంచ్



## ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభం



**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని ముచ్కూర్ గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వ్యవసాయ సహకార పరపతి సంఘం వైస్ ఛైర్మన్ గంగారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఇళ్ల మంజూరుకు సాయం చేసిన నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గట్టు మురారి, బద్దం అవినాష్, కొరడి లింబాద్రి, తెడ్డు అశోక్, గాడి రాకేష్, కైరి శ్రీధర్, కైరి సాగర్ గౌడ్ స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణా అడ్డుకోవాలి



**అక్షరటుడే, కోటగిరి:** తమ గ్రామం నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని, అడ్డుకోవాలని కోడిచర్ల వాసులు కోరారు. ఈ మేరకు సోమవారం పోతంగల్‌లో తహశీల్దార్ గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని మంజీర శివారులో సర్వే నెంబర్ 334లో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారని, ఈ విషయమై పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హద్దులు నిర్ధారించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## నవోదయ విద్యాలయానికి ఎంపిక



**అక్షరటుడే, భీమ్‌గల్:** పట్టణంలోని సరస్వతీ విద్యామందిర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని యేన్ను శ్రీకరి నిజాంసాగర్ నవోదయ పాఠశాలకు ఎంపికైంది. ఈ మేరకు నవోదయ పాఠశాలలో తొమ్మిదో తరగతికి ఎంపిక కాగా, సోమవారం పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ జి బసంత్ రెడ్డి, కమిటీ సభ్యులు, ప్రధానాచార్యులు రాస రవికుమార్ విద్యార్థిని అభినందించారు. చదువులో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి నర్సారెడ్డి, అకడమిక్ ఇన్‌చార్జి పి సాయిచరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



**పూర్వ విద్యార్థుల సమ్మేళనం**

పట్టణంలోని క్షత్రియ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల 2007–2010 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. స్నేహితులంతా ఒక్కచోట చేరి.. ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు చెప్పిన అధ్యాపకులను సన్మానించారు. – అక్షరటుడే, ఆర్మూర్

## బస్సు ఢీకొని కార్మికుడి దుర్మరణం



**అక్షరటుడే, కామారెడ్డి:** రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన కామారెడ్డి పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడ్వాయి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన పైడాకుల నారాయణ (52) కామారెడ్డి పట్టణంలోని ధర్మశాల సమీపంలో రెడీమేడ్ డోర్స్ తయారీ షాపులో పని చేస్తున్నాడు. ప్రతి రోజూ మాదిరిగానే తన టీవీఎస్ ఎక్సెల్‌పై ఇంటినుంచి కామారెడ్డికి బయలుదేరాడు. రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న తన షాప్‌నకు రెండు నిమిషాల్లో చేరుకునే సమయంలో వెనకనుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఎక్సెల్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో నారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబీకులు ఘటనా స్థలానికి వచ్చి బోరున విలపించారు. ప్రమాదం కారణంగా ఆ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం ట్రాఫిక్ క్లియర్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రైవేటు వ్యక్తులతో పనులు..

మొదటిపేజీ తరువాయి: సబ్ రిజిస్ట్రార్ మాత్రం తనకేమీ పట్టనట్లు వ్యవహరించడం కొసమెరుపు.

### అక్రమాలకు ఆస్కారం

ప్రభుత్వ ఆఫీసుల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఎంతో కీలకమైనవి. వీటిల్లో రోజువారి జరిగే కార్యకలాపాలు, దస్తావేజులు అత్యంత గోప్యంగా ఉంచాల్సినవి ఉంటాయి. కానీ సబ్‌రిజిస్ట్రార్లు మాత్రం ఇలా ప్రైవేటు వ్యక్తులను నియమించుకుని మరీ వారితో అధికారిక పనులు చేయించడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా గతంలో నిజామాబాద్ అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో నకిలీ డాక్యుమెంట్లు వందలకొద్దీ బయటకు వచ్చిన విషయం తెలిసిందే. ప్రైవేటు వ్యక్తులే నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారని ప్రచారంలో ఉంది. ఈ నేపథ్యంలో బోధన్ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తులతో పనులు చేయించడంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### రూరల్, ఎల్లారెడ్డి కార్యాలయాల్లోనూ..

నిజామాబాద్ రూరల్, ఎల్లారెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ప్రైవేటు వ్యక్తులు అధికారిక పనులు చక్కబెడుతున్నట్లు సమాచారం. డాక్యుమెంట్లకు సంబంధించిన సేవలు అందించడం, ఆన్‌లైన్ తదితర పనులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా ప్రైవేటు వ్యక్తులు అన్ని పనులు చక్కబెడుతుండడం చూసి కార్యాలయాలకు వచ్చిన వారు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. ప్రైవేటు వ్యక్తుల ద్వారా ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేయించడంపై నిజామాబాద్ డీఆర్, డీఐజీ ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

# అక్రమ వసూళ్లపై చర్యలేవి..

మొదటిపేజీ తరువాయి:

### గతంలో రూ.పదివేలు.. ప్రస్తుతం రూ.లక్ష..!

తాజాగా.. నిజామాబాద్ నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు సంబంధించిన రెన్యూవల్ దస్త్రం డీఈవో వద్దకు వెళ్లింది. కాగా.. ఆ ఫైల్‌ను పరిశీలించిన డీఈవో పలు కొర్రీలు పెట్టి వెనక్కి పంపారు. ఆ తర్వాత సదరు పాఠశాల యాజమాన్యం పలు ప్రయత్నాలు చేసి నిబంధనల మేరకు దస్త్రాన్ని సిద్ధం చేసి అనుమతి కోసం రీఅప్లికేషన్ చేసుకుంది. తదనంతరం రెన్యూవల్ పూర్తయింది. ఇదే అదునుగా "డీఈవో స్ట్రిక్ట్‌గా ఉన్నారు".. అని సాకుతో కార్యాలయ సెక్షన్ అధికారులు, సిబ్బంది రూ. లక్ష వరకు వసూలు చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఇదే పనికోసం తాము గతంలో రూ. పది వేలు చెల్లించామని.. ఇప్పుడు రూ. లక్ష సమర్పించుకోవాల్సి వచ్చిందని సదరు పాఠశాల యాజమాన్యం మొరపెట్టుకుంది. ప్రస్తుతం దాదాపు అన్ని ప్రైవేటు పాఠశాలల ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నట్లు సమాచారం.

### సొంత వారిపై చర్యలేవి..!

డీఈవో నిరంతరం తన పర్యవేక్షలో ఉండే డీఈవో కార్యాలయంలో ఈ పరిస్థితి నెలకొనడంపై విమర్శలు వస్తున్నాయి. కిందిస్థాయి అధికారులు, సిబ్బంది ఎవరికి వారు వర్గాలుగా విడిపోయి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నా.. వారిని కట్టడి చేయలేకపోతున్నారు. ఇకనైనా జిల్లా విద్యాధికారి దృష్టి సారించి కార్యాలయాన్ని ప్రక్షాళన చేయాలని ప్రైవేటు పాఠశాలలు, ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

## మహిళను మోసగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

**అక్షరటుడే, బాన్సువాడ:** దళిత మహిళను వివాహం చేసుకుని, కులం పేరుతో వేధించిన భర్తపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ సభ్యుడు రాథోడ్ సునీల్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీర్కూర్ మండలకేంద్రానికి చెందిన నర్ర సాయిలు అదే గ్రామానికి చెందిన దళిత మహిళను రెండో పెళ్లి చేసుకున్నాడని, 16 ఏళ్లుగా కాపురం చేసి, ఇప్పుడు కులం పేరుతో వేధిస్తున్నాడన్నారు. దీంతో సదరు మహిళ న్యాయం కోసం ధర్నా చేయగా, ఆమెను పరామర్శించినట్లు పేర్కొన్నారు. ఆమెకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని, విషయాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఛైర్మన్, కలెక్టర్, డీఎస్పీ దృష్టికి తీసుకెళ్తామన్నారు.





విద్యుత్ తీగలు మృత్యుపాశాలుగా మారాయి. కరెంట్ వైర్లు దారాల్లా తెగిపోతున్నాయి. అవి తగిలి ప్రజలు, మూగజీవాలు ప్రాణాలు కోల్పోతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. గాంధారి మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం దుర్గానగర్ కాలనీలో అకస్మాత్తుగా కరెంట్ తీగలు తెగిపోయి మూడు మేకలు విద్యుత్ షాక్‌తో చనిపోయాయి. వెంటనే స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు తెలపడంతో సరఫరా నిలిపివేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. అనంతరం విద్యుత్ తీగలను సరి చేశారు. – అక్షరటుడే, గాంధారి

# కరెంట్ తీగలు.. మృత్యుపాశాలు

▸ గాంధారి మండలంలో తరచూ తెగిపోతున్న విద్యుత్ వైర్లు
▸ ప్రాణాలు కోల్పోతున్న మనుషులు, జీవాలు ▸ పట్టించుకోని అధికారులు

విద్యుత్ వైర్ తెగిపడి ఇటీవల ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన చిన్న పోతంగల్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఆకిటి భూదవ్వ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా.. స్తంభం నుంచి తీగ తెగిపడి ఆమెపై పడింది. దీంతో భూదవ్వకు తీవ్ర గాయాలు అయ్యాయి. అలాగే ఇటీవల ముదెల్లి గ్రామంలో కౌలు రైతు హన్మాండ్లు పొలంలో బోరు మోటారు స్టార్ట్ చేస్తుండగా విద్యుత్ షాక్‌తో మరణించాడు. ఇలా గాంధారి మండలంలో ఇటీవల విద్యుత్ వైర్లు తెగిపడుతున్న ఘటనలు అనేకం చోటుచేసుకుంటున్నాయి.

### కాలం చెల్లిన వైర్లతో..

విద్యుత్ స్తంభాలకు తీగలు ఏర్పాటు చేసి 40 నుంచి 50 ఏళ్లు అవుతోందని ఏఈ లక్ష్మణ్ తెలిపారు. వాటి కాలం చెల్లిపోవడంతో తెగిపడుతున్నాయన్నారు. చాలా చోట్ల ఇది వరకే పాత వైర్లను తొలగించి కొత్తవి ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే అక్కడక్కడ కొన్ని వైర్లు ఉన్నాయని త్వరలోనే వాటిని కూడా తొలగించి కొత్తవి వేస్తామన్నారు. విద్యుత్ తీగలకు కొండ్లు వేయడం, చెట్ల కొమ్మలు తాకుతుండడంతో కూడా తెగిపోతున్నాయని ఆయన తెలిపారు.

### పరిహారం అందించాలని వేడుకోలు

గాంధారిలో ఇటీవల విద్యుత్ వైర్లు తెగిపోయి దొల్లు రమేశ్‌కు చెందిన మూడు మేకలు చనిపోయాయి. దీంతో మేకలు మేపుకుంటూ జీవనం వెళ్లదీస్తున్న తనకు రూ.50 వేల నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. తనకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని ఆయన కోరుతున్నాడు. ఇలా విద్యుత్ వైర్లు తెగిపోయి నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలని బాధితులు వేడుకుంటున్నారు. అంతేకాకుండా సక్రమంగా లేని చోట కొత్త విద్యుత్ వైర్లు వేయాలని కోరుతున్నారు.



## హాస్టళ్లలో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



**అక్షరటుడే, బోధన్:** హాస్టళ్లలో విద్యార్థులకు అసౌకర్యాలు లేకుండా చూడాలని సబ్ కలెక్టర్ వికాస్ మహతో వార్డెన్లకు సూచించారు. ఈ మేరకు సోమవారం తన కార్యాలయంలో ఆయా హాస్టళ్ల వార్డెన్లతో సమీక్షించారు. ఈ విద్యా సంవత్సరంలో నూతనంగా చేరిన విద్యార్థులు, వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, వసతి కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలగంగాధర్, ఎంఈవో నాగయ్య పాల్గొన్నారు.

## వినాయక ఉత్సవాల్లో డీజేకు అనుమతి లేదు



**అక్షరటుడే, ఆర్మూర్ :** వినాయక చవితి ఉత్సవాల్లో డీజేకు అనుమతి లేదని ఎస్‌హెచ్‌వో సత్య నారాయణ అన్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం డీజే నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వినాయక మండపాల నిర్వహకులు ముందుగా పోలీసు అనుమతి తీసుకోవాలన్నారు. డీజేలు పెడితే కేసుల నమోదు చేస్తామన్నారు. ఉత్సవాలను శాంతియుతంగా, భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. అధిక శబ్దం చేసే డీజేలతో వృద్ధులు, పిల్లలకు ఇబ్బంది కలిగించవద్దని కోరారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని జువ్వాడి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సోమవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ఆదేశాల మేరకు బాధితులకు చెక్కులను అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు భూమేష్, వెంకట్ రెడ్డి, వినయ్‌కుమార్, భాస్కర్, సాయిలు, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ సమస్యలు పరిష్కరించండి



**అక్షరటుడే, బోధన్:** పట్టణంలోని ఆటోనగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సబ్ కలెక్టర్ వికాస్ మాహతోకు వినతిపత్రం సమర్పించారు. వర్షాకాలంలో కాలనీలో డ్రెయినేజీలు లేకపోవడంతో మురికినీళ్లన్నీ ఇళ్లలోకి వస్తున్నాయని వాపోయారు. విష పురుగులు, పాములు ఇళ్ల చుట్టూ తిరుగుతున్నాయని.. తక్షణమే కాలనీలో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని వారు కోరారు.

## గైనకాలజిస్టుల నియామకంపై హర్షం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మూడు గైనకాలజిస్టుల నియామకంపై హర్షం వ్యక్తమవుతోంది. ఈ మేరకు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గైనకాలజిస్టుల నియామకం కోసం ఎమ్మెల్యే ఎంతో కృషి చేశారన్నారు. ఇటీవల జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆస్పత్రిలో గైనకాలజిస్టుల కొరతతో గర్భిణులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావించారన్నారు. దీంతో అధికారులు వెంటనే వైద్యులను నియమించారని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని సికింద్రాపూర్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. పార్టీలో చేరినవారిలో మాజీ ఉప సర్పంచ్ చెరుకుపల్లి శోభన్, గంగాధర్, గజేందర్ గౌడ్, నవీన్, బక్కన్న, నర్సింలు, ఖదీర్, కలీం, సాజిద్, ముక్తార్, నల్లవెల్లి గంగాధర్, శ్రీను, తదితరులున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులపై పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు బొదిరే స్వామి, మాజీ ఎంపీపీ సురేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అనంతరావు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు రాజు, కిసాన్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చిన్న రెడ్డి, జలం గౌడ్, పాల్గొన్నారు.

## గ్రంథాలయాన్ని బలోపేతం చేయాలి



**అక్షరటుడే, భీమ్‌గల్:** ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో గ్రంథాలయాలను బలోపేతం చేయాలని సమగ్ర శిక్ష అభియాన్ ఏఎంవో బాలకృష్ణ రావు అన్నారు. పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా పిల్లల్లో పఠనాసక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు జాన్ విల్సన్, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం సత్య రమేష్, ఆర్పీ ఎడ్లశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న ఫోన్లు తిరిగి అప్పగింత




**అక్షరటుడే, బోధన్:** బోధన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న ఫోన్లను వారికి అప్పగించినట్లు సీఐ వెంకట్ నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం బాధితులకు ఫోన్లను పోలీస్‌స్టేషన్ ఆవరణలో అందజేశారు. పోగొట్టుకున్న ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేశామని.. బాధితులు ఎవరైనా ఫోన్లు పోగొట్టుకుంటే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

## మొక్కలు నాటిన విద్యార్థులు



**అక్షరటుడే, బోధన్:** వన మహోత్సవంలో భాగంగా పట్టణంలోని తట్టికోట హైస్కూల్‌లో విద్యార్థులు మొక్కలు నాటారు. బోధన్ సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు బోధన్ మున్సిపల్ సిబ్బంది పాఠశాలలో విద్యార్థులతో మొక్కలు నాటించారు. మొక్కల పెంపకం ద్వారా కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయ బృందం సభ్యులు పాల్గొన్నారు.

## భవిత కేంద్రంలో ఫిజియోథెరపి శిబిరం




**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని భవిత కేంద్రంలో సోమవారం చిన్నారులకు ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు డాక్టర్ సారిక ఫిజియోథెరపీ చేశారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఫిజియోథెరపీ చేయించాలని దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, పెంటయ్య, మాజీ వార్డుసభ్యుడు నితిన్, సురేష్ పాల్గొన్నారు.

కామారెడ్డి కేంద్రంగా సాగుతున్న కల్తీ ఆయిల్ తయారీ వ్యాపారం రోజురోజుకూ విస్తరిస్తోంది. ఇక్కడ కల్తీ నూనెను తయారు చేసి ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు సరఫరా చేస్తూ దండిగా లాభాలు గడిస్తున్నారు. ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతుందని తెలిసినా అధికారులు మౌనం వహించడం అనుమానాలకు తావిస్తోంది. కల్తీ వ్యాపారంపై ఉక్కుపాదం మోపాల్సి ఉండగా.. నోరు మెదపకపోవడం, కార్యాలయం దాటి అడుగులు బయటకు వేయకపోవడం వెనక కారణాలు ఏమిటనే అని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. – అక్షరటుడే, కామారెడ్డి

# కల్తీపై కట్టడేది..!



▸ మార్కెట్లో జోరుగా కల్తీ ఆయిల్ సరఫరా చేస్తున్న మాఫియా ▸ తనిఖీలకు అధికారుల వెనుకంజ ▸ అనారోగ్యాల పాలవుతున్న ప్రజలు

జిల్లాలో కల్తీ నూనె వ్యాపారం మూడు పూలు.. ఆరు కాయలుగా సాగుతోంది. బ్రాండెడ్ ఆయిల్ పేరిట కల్తీ నూనెను విక్రయిస్తున్నారు. దీంతో ఏ ఆయిల్ వాడితే ఏ ప్రమాదం పొంచి ఉందో తెలియక ఆందోళనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో కల్తీ మాఫియా ఆగడాలను అరికట్టేందుకు నడుం బిగించాల్సిన అధికారులు మాత్రం తెరచాటునే ఉండిపోతున్నారు. నిరంతరం తనిఖీలు చేపట్టి అక్రమార్కుల ఆటకట్టించాల్సి ఉండగా తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### కన్నెత్తి చూడని అధికారులు

జిల్లాలో జోరుగా కల్తీ వ్యాపారం సాగుతోందని బహిరంగంగానే చర్చ సాగుతున్నా అధికారులు మాత్రం తమకేమీ తెలియనట్లుగా సైలెంట్‌గా ఉన్నారు. ఇటీవల పలు నకిలీ కంపెనీల కల్తీనూనెపై ఆరోపణలు వచ్చినప్పటికీ ఎందుకు మౌనంగా ఉంటున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దందా యథేచ్ఛగా సాగుతున్నా కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### కట్టడికి ఇప్పటికైనా చర్యలు తీసుకునేనా..

కల్తీ ఆయిల్ ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది. రసాయనాలు కలిపి వివిధ బ్రాండ్ల పేరిట విక్రయిస్తుండడంతో ప్రజలు వాటిని కొనుగోలు చేస్తున్నారు. ఇలాంటి నూనెలు వినియోగించడం వల్ల దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు మెండుగా ఉంటాయి. అయినా అధికారులు స్పందించడం లేదు. ఇకనైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి కల్తీ ఆయిల్ సరఫరాను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### నాసిరకం కల్తీ నూనెలతో అనారోగ్యం



నాసిరకం, కల్తీ నూనెలతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. వివిధ రసాయనాలు కలిపి బ్రాండ్ల పేరుతో కల్తీ చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరించడం సిగ్గుచేటు. కామారెడ్డి జిల్లా కేంద్రంగా నూనెలకు కల్తీ మాఫియా అడ్డాగా మారింది. కల్తీ దందా ఆగకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం.

- నీల నాగరాజు, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘం జిల్లా కన్వీనర్